
ఆంధ్రజ్యోతి



నంద్యాల

జిల్లా వార్తలు 5

మంగళవారం 29 జూలై 2025



నల్లమలలో డేంజర్ బెల్స్..!

నల్లమలలో పెద్దపులులకు ముప్పు ముంచుకొస్తోంది. కొన్నేళ్లుగా నల్లమలలో పెద్దపులుల సంతతి ఆశాజనంగా ఉన్నప్పటికీ ఈ ఏడాది ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇందుకు గల కారణాలను పరిశీలిస్తే.. అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో పర్యవేక్షణ లోపించడంతో పాటు ఇటీవల కాలంలో నల్లమలలో వేటగాళ్ల సంచారం అధికమైనట్లు విమర్శలు ఉన్నాయి. పైగా విధుల్లో అలసత్వం వహించే ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు లేకపోవడంతో చివరికి పులుల మనుగడకే ప్రమాదం వాటిల్లుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రతిఏటా జూలై 29వ తేదీన వరల్డ్ టైగర్స్ డే నిర్వహిస్తారు. వాస్తవానికి 2010లో తొలిసారిగా వరల్డ్ టైగర్స్ డేను జరిపి అప్పటి పులుల సంఖ్యను 2022 నాటికి రెట్టింపు చేయాలని పూనుకున్నారు. అయితే దేశంలో పులుల వృద్ధిరేటు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికి నల్లమలలో మాత్రం పులుల సంఖ్య ఆశాజనంగా మారింది. పలు సందర్భాల్లో నల్లమలలో పులుల సంఖ్యలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ గడిచిన ఏడేళ్లుగా పులుల సంఖ్యలో వృద్ధి కనిపించింది. దేశంలోనే పులుల వృద్ధిరేట్ తగ్గుముఖం పట్టినా.. నల్లమలలో మాత్రం ఊపందుకుంది. కానీ.. ఈ ఏడాది జరిపిన ఫేస్-4 గణాంకాల్లో పులుల సంఖ్య క్షీణించడం ఆందోళనకు గురిచేస్తోంది.

-ఆత్మకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి)

ఎన్ఎస్‌టీఆర్‌లో పులుల గణాంకాలను పరిశీలిస్తే..

నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆదేశాల మేరకు ప్రతి నాలుగేళ్లకు ఓసారి దేశంలో పులులను లెక్కిస్తారు. అదేక్రమంలో గత కొన్నేళ్లుగా ప్రతిఏటా ఫేస్-4 ప్రక్రియ కింద నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) పరిధిలో పెద్దపులులతో సహా ఇతర వన్యప్రాణుల గణాంకాలను లెక్కిస్తారు. ఆయా గణాంకాల ప్రకారం ఉమ్మడి ఏపీలోని ఎన్ఎస్‌టీఆర్‌లో 2006 గణాంకాల ప్రకారం 95 పెద్దపులులు ఉన్నట్లు అంచనా వేశారు. 2010లో వాటి సంఖ్య 72కు పడిపోయింది. ఆ తర్వాత 2014లో చేపట్టిన పులుల గణాంకాల్లో 68కి చేరింది.

మిగతా 6వ పేజీలో

- ఫేస్-4 గణాంకాల్లో తగ్గిన పులుల సంఖ్య..?
- ఎన్ఎస్‌టీఆర్‌లో కొరవడిన పర్యవేక్షణ
- పులుల మరణాలు జరుగుతున్నా చర్యలు శూన్యం
- రేంజర్ల పనితీరుపై విమర్శలు
- నేడు వరల్డ్ టైగర్స్ డే

‘పీ-4’తో పేదల జీవితాల్లో వెలుగులు

- సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలి
- లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలి
- కలెక్టర్ రాజకుమారి



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రవేశపెట్టిన కార్యక్రమమే ‘పీ-4’ అని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం కలెక్టర్ పలు ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు 250 కుటుంబాలను దత్తత తీసుకున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలో 42,937 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉండగా 41,613 కుటుంబాలను మాత్రమే దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా 1324 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు మరింత కృషిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. జిల్లాలో ప్రతిశాఖలో మంచి ప్రాజెక్టులు ఉంటాయని, వాటిని ఎప్పటికప్పుడు ఆర్టీజీఎస్‌లో అప్‌లోడ్ చేసి జిల్లాకు ఇచ్చిన టార్గెట్ పూర్తిచేయాలన్నారు. కుందూ నదికి నీటిని విడుదల చేశారని, నది సమీపంలో ఉన్న 72గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి విద్యను అందించాలన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ రాజకుమారి అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రాజకుమారి 233అర్జీలను స్వీక రించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ రీసర్వేలో తమకు భూమి తక్కువగా వచ్చిందని గోస్పాడు మండలం రాయపాడు గ్రామానికి చెందిన రవి కుమార్ ఫిర్యాదు చేశారు. అలాగే డోన్ చెందిన గంగిరెడ్డి ఇంటి పన్ను కట్టినా రసీదులు ఇవ్వడం లేదని, తనకు రసీదులు ఇప్పించేలా అధికారులను ఆదేశించాలని అర్జీ అందజేశారు. గ్రీవెన్స్‌కు 233 అర్జీలు వచ్చాయని, అందులో అధికంగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని చెప్పారు.

రతనాల సీమగా మారుస్తాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ మాధవ్
- పద్మావతినగర్ నుంచి వైజంక్షన్ వరకు ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నంద్యాల కల్చరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ మాధవ్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల సౌజన్య ఫంక్షన్‌హాలులో జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ముందుగా పార్టీ కార్యాలయం చేరుకొని సీనియర్ కార్యకర్తలకు సన్మానించారు. 100ఏళ్ల చరిత్ర కలిగిన మారుతి వ్యాయామ మండలిని సందర్శించారు. పద్మావతినగర్ నుంచి వైజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం సౌజన్య ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన సమావేశంలో మాధవ్ మాట్లాడారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను త్వరలో పూర్తిచేయ డానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రూ.10 కోట్లు నిధులు వచ్చాయంటే అందులో రూ.9.5కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినవే అని అన్నారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోదీ అందిస్తున్న సుపరిపాలనను ప్రపంచ దేశాలు గుర్తించాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిందంటే సామాన్య ప్రజలకు కూడా పార్టీలో ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశం ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ నవ నందుల నిలయమైన నంద్యాలకు మాధవ్ రావడం సంతోషంగా ఉందన్నారు. నంద్యాల నుంచి రాష్ట్రపతి, ప్రధానమంత్రి స్థాయి నాయకులు ఎన్నికైన చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదన్నారు. అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమైందన్నారు. పార్టీకోసం కృషిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. నంద్యాల జిల్లాను స్పిరుచువల్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నారు. కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాయకుడు మాధవ్ అని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. సంఘటన్ కార్యదర్శి మధుకర్ మాట్లాడుతూ బీజేపీ 2014 కంటే ముందు కంటే 2014 తర్వాత గురించి ప్రజలకు బాగా తెలుసునన్నారు. కార్యక్రమంలో బిట్రగుంట శివనారాయణ, రమేష్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

సిద్ధాపురం ఆయకట్టును స్థిరీకరిస్తాం

- వైసీపీ హయాంలో ప్రాజెక్ట్ అభివృద్ధి శూన్యం
- ప్రస్తుతం రూ.9కోట్లతో పనులు, మరో రూ.86కోట్లతో ప్రతిపాదనలు
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఎడమ ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం ఎత్తిపోతల పథకం పూర్తి ఆయకట్టును స్థిరీకరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వెలుగోడు జలాశయం నుంచి ఎత్తిపోతల ద్వారా సిద్ధాపురం చెరువుకు నీటివిడుదలను ప్రారంభించారు. ముందుగా స్టేజ్-1 వద్ద పంపింగ్ మోటార్లకు పూజలు చేపట్టారు. అనంతరం డెలివరీ పాయింట్ వద్ద వీబీఆర్ జలాలకు గంగహారతి నివేదించారు. ఆ తర్వాత ఎడమ ప్రధాన కాల్వ తూము వద్దకు పాదయాత్రగా చేరుకుని చెరువు స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2018 జనవరి 7వ తేదీన సీఎం చంద్రబాబు చొరవతోనే సిద్ధాపురం ఎత్తిపోతలను ప్రారంభించినట్లు చెప్పారు. ఆక్రమంలోనే ప్రాజెక్ట్ అభివృద్ధి మరిన్ని ప్రతిపాదనలు చేశామని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్ట్ నిర్వహణ అధ్వానంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంతో ప్రతిష్టాత్మకంగా సిద్ధాపురం ఎత్తిపోతల పథకం అభివృద్ధిపై దృష్టి సారించినట్లు వివరించారు. రూ.9కోట్ల నిధులను మంజూరు చేయించి ఎల్ఎంసీ, ఆర్ఎంసీ కెనాల్స్ తూముల వద్ద శాశ్వతమైన కాంక్రీట్ పనులతో పాటు మట్టికట్టపై జంగిల్ క్లియరెన్స్, తదితర పనులు చేపట్టామన్నారు. అదేక్రమంలో మండలంలోని ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట, వెంకటాపురం, అమలాపురం, కృష్ణాపురం గ్రామాల్లోని సుమారు 5వేల ఎకరాల అదనపు ఆయకట్టు కోసం రూ.25కోట్లు, డిస్టిబ్యూరీ సిస్టమ్స్, ఫీల్డ్ కెనాల్స్‌కు రూ.16కోట్లు, వీబీఆర్ నుంచి స్టేజ్-1 వరకు అప్రోచ్‌కెనాల్ కాంక్రీట్ బెడ్, లైనింగ్ పనుల కోసం రూ.30కోట్లు, ఓవర్ హెడ్ కరెంట్ లైన్ కోసం రూ.15కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయించామన్నారు. సిద్ధాపురం చెరువు వద్ద ఎన్టీఆర్, బుడ్డా వెంగళరెడ్డి స్మృతివనాలను ఏర్పాటు చేసి పర్యాటక అభివృద్ధికి కృషిచేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, నాయకులు శేషిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, మల్లె ఎలీషా, కొండలరావు, నజీర్‌అహ్మద్, వెన్నా శ్రీధర్‌రెడ్డి, స్వామిరెడ్డి, వెంకటరమణ, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, అరుణ్, తెలుగుగంగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జలాశయాలు కళకళ



- శ్రీశైలానికి పోటెత్తిన వరద 7
- నదీతీర గ్రామాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ

శ్రీశైలంలో భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భ్రమరాంబికా మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. సోమవారం ఇరు రాష్ట్రాలకు చెందిన భక్తులు శ్రీశైలం డ్యాంను సందర్శించి అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలోని అన్ని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు చెబుతున్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఆలయ అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగు నీరు, అల్పాహారాన్ని అందించారు.

నిర్మాణదారులకు భారీ ఊరట..!



నంద్యాల, జూలై 28(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో మాదిరిగా ఎల్ఆర్ఎస్ (అన్ అప్రూవ్డ్ లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ విషయంపై ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం కూడా తెలపడంతో తాజాగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో వేసిన అనధికార లేఅవుట్లకు ఈ స్కీమ్‌ను వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ప్లాను లేకుండా నిర్మాణాలు చేసుకున్న నిర్మాణదారులకు లబ్ధి చేకూరనుంది. నిజానికి గతంలో టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు క్రమబద్ధీకరణను అమలు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ స్కీమ్‌లను పొడిగించకుండా రద్దు చేయడంతో ఐదేళ్లుగా నిర్మాణదారులు తమ నిర్మాణాలను క్రమబద్ధీంచుకొనే అవకాశం లేక ఇబ్బందులు పడ్డారు ప్లాను మంజూరుకు అవకాశం లేని నిర్మాణాలు పట్టణ పరిధిలో అనేకంగా ఉన్నాయి.

నిర్మాణ రంగానికి ఊతం

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగానికి భారీ ఊరట లభించినట్లయింది. అనధికార లేఅవుట్‌లలో స్థలాల క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పించింది. స్థల రిజిస్ట్రేషన్ విలువలో నిర్ణీత రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధించిన నిబంధనలను ఎత్తివేసింది. నాన్ లేఅవుట్‌లో ప్లాట్ కొనుగోలు చేసుకుంటే క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం ఆంక్షలు విధించింది. మొత్తం లేఅవుట్‌ను గుర్తించాలని మున్సిపాలిటీలకు దిశానిర్దేశం చేసింది. ఆ తర్వాతే అందులో ఉన్న ప్లాట్‌లను క్రమబద్ధీకరిం చేలా నిబంధన పెట్టింది. ఫలితంగా 2020లో అమలు చేసిన లేఅవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవడానికి నిర్మాణదారులు వెనుకంజ వేశారు. ప్రతి మున్సిపాలిటీలోనూ కొద్దిమంది మాత్రమే దరఖాస్తు చేసుకు న్నారు. దీంతో వాటిని క్రమబద్ధీకరించలేని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగానే ఎల్ఆర్ఎస్ గడువు ముగిసి పోయింది. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపో యాయి. కూటమి ప్రభుత్వం తీసుకు న్న తాజా నిర్ణయంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పెండింగ్ దరఖాస్తులను ప్రస్తావించింది. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని దిశానిర్దేశం చేసింది. అప్పట్లో నిర్ణీత రుసుం చెల్లించినవారికే వర్తిస్తుంది. కొత్తగా విధించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

ఇక నాన్ లే-అవుట్ ప్లాట్లకు డిమాండ్

వైసీపీ హయంలో ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేయడంతో నాన్‌లే-అవుట్ ప్లాట్లలో చిన్న నిర్మాణా లకు ప్లాన్ మంజూరు కోసం రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల దాకా ఫీజులు చెల్లించాల్సి రావడంలో చాలా మంది యజమానులు ఇళ్ల నిర్మాణాల కోసం ముందుకు రాలేదు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంలో నాన్ లే-అవుట్ ప్లాట్లకు డిమాండ్ పడిపోయి వాటి ధరలు కూడా బాగా పడి పోయాయి. ప్రభుత్వం తిరిగి ఎల్ఆర్ఎస్‌ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో నాన్ లే-అవుట్ ప్లాట్లలో నిర్మాణాలు జోరందు కున్నాయి. ప్లాట్ల ధరలు కూడా పెరిగే అవకాశం కలిగింది.



శివారు ప్రాతంలో నాన్ లే-అవుట్ ప్లాట్లలోని నిర్మాణాలు

- రియల్ ఎస్టేట్‌కు ఊతం
- అనధికార నిర్మాణాలు, నాన్ లే-అవుట్ ప్లాట్‌లకు క్రమబద్ధీకరణ
- చాలా కాలంగా ఎదురు చూస్తున్న నిర్మాణదారులు
- ఎల్ఆర్ఎస్ మార్గదర్శకాలు జారీ
- వైసీపీ హయాంలో అనుమతులు నిరాకరణ
- సవరించిన కూటమి ప్రభుత్వం

నాన్ లే అవుట్‌కు గడువు

ప్రభుత్వం నాన్ లేఅవుట్ అయినా, లేఅవుట్ అయినా ప్లాట్ల క్రమబద్ధీకరణపై గడువు విధించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2025 జూలై 30 నాటికి ఉన్న లేఅవుట్‌లనే పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. అంటే అప్పటికే లే అవుట్‌లోని ఒక ప్లాట్ అయినా విక్రయించాలి. అప్పుడే అందులోని ఇతర ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. లేదంటే ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు నిబంధనలు వర్తించవు. ఇటీవలి కాలంలో పట్టణాల్లో నాన్ లేఅవుట్‌లు అధికంగా పుట్టుకొచ్చాయి. వాటిపైనే రిజిస్ట్రేషన్లు కూడా అవుతున్నాయి. కొన్నింటిని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చేస్తున్నారు. విక్రయాలు జరగడం లేదు. వీటికి మాత్రం ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు వర్తించే అవకాశం లేదు.

మిగతా 7వ పేజీలో

నల్లమలలో డేంజర్ బెల్స్..!

(5వ పేజీ తరువాయి)

ఈలెక్కన 8ఏళ్లలో 27పులుల క్షీణించాయి. ఆతర్వాత 2018 గణాంకాల ప్రకారం ఉమ్మడి ఏపీలో 74 పులులు ఉన్న ట్లు అంచనా వేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిధిలోని నాగార్జున సాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో 48 పులులు ఉన్నట్లు అంచనా వేయగా, తెలంగాణలోని అమ్రాబాద్, కవాల్ అభయా రణ్యాల పరిధిలో 26 పులులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో కవాల్‌లో నాలుగైదు పులులు ఉండగా మిగిలిన పులుల అమ్రాబాద్ అభయారణ్యం పరిధిలోని నల్లమల అడవుల్లోనే ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని ప్రాథమికంగా గుర్తించారు. ఆతర్వాత 2022 గణాంకాల ప్రకారం ఏపీలోని ఎన్ఎస్‌టీఆర్‌లో 73 ఉండగా, తెలంగాణలో మరో 35ఉన్నట్లు తెలుస్తోంది.

రేంజర్ల పనితీరుపై విమర్శలు

గతంలో ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పనిచేసిన కొంతమంది డీఎఫ్ఓలు విధుల్లో కఠిన నిర్ణయాలు తీసుకోవడంతో నల్లమలలో గస్తీ పెరిగి పులుల సంరక్షణ కూడా సజావుగా ఉండేది. అయితే గత కొన్నేళ్లుగా అటవీ ఉద్యోగుల విధినిర్వహణలో అలసత్వం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఒకప్పుడు రేంజర్ స్థాయి అధికారులు కింది స్థాయి సిబ్బందిని వెంట పెట్టుకుని కమాండర్ జీపుల్లో అటవీ ప్రాంతాల్లోని మారుమూల ప్రాంతాలకు రాత్రిళ్లు సైతం వెళ్లి గస్తీ చేసేవారు. కానీ.. ప్రస్తుతం చాలామంది రేంజర్లు ఆతరహా విధులకు దూరమైనట్లు తెలుస్తోంది. దీనికితోడు కింది స్థాయి ఉద్యోగులతో సమన్వయం లేకుండా బాసిజాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. ఆక్రమంలోనే మరికొంత మంది రేంజర్లు అటవీ రక్షణ మరిచి కార్యాలయాలకే పరిమితమవుతున్నట్లు తెలిసింది. కేవలం అడవుల్లో జరిగే వివిధ సివిల్ వర్క్‌లపై దృష్టి సారిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు.. బినామీ కాంట్రాక్టర్లను వారే నియమించి వర్క్‌ల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే ఫారెస్ట్ చెక్‌పోస్టుల నిర్వహణ పేరుతో మరికొంత మంది ఉద్యోగులు ఫారెస్ట్ ప్రొటెక్షన్ వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు ఉన్నాయి. అదేక్రమంలో అటవీ శాఖగా సమృద్ధిగా ఉద్యోగుల నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అరకొర నియామకాల వల్ల అటవీ, వన్యప్రాణి సంరక్షణ సజావుగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాగా ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఇటీవల కొంతమంది రేంజర్లు బదిలీ కావడంతో వారి స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. ఈ నెల చివరన మరో రేంజర్ రిటైర్డు కాబోతున్నారు. అయినప్పటికీ రేంజర్ల నియామకంలో ఉన్నతాధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.



నేటికీ కనిపించని తల్లి పులి ఆచూకీ (ఫైల్)

నల్లమలలో తగ్గిన పులుల సంఖ్య?

నల్లమలలోని ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో ఇటీవల చేపట్టిన ఫేస్-4 గణాంకాల ప్రకారం ఈ ఏడాది పులుల సంఖ్య క్షీణించినట్లు తెలిసింది. వాస్తవానికి 2023-24 సంవత్సరానికి సంబంధించి ఫేస్-4 పులుల కనీస గణాంకాలను జూలై 29వ తేదీన డిప్యూటీ సీఎం, రాష్ట్ర అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ వెల్లడించారు. దీనిప్రకారం ఎన్ఎస్‌టీఆర్‌లో 76 పెద్దపులులు, 11 పులికూనలతో కలిపి మొత్తం 87 పులులు ఉన్నట్లు అంచనా వేశారు. కానీ ఈ ఏడాది చేపట్టిన ఫేస్-4 గణాంకాల్లో 70కంటే పులులు తక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయం అటవీశాఖను మరింత ఆందోళనకు గురిచేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ వివరాలు మంగళవారం జరిగే వరల్డ్ టైగర్స్ డే రోజున వెల్లడిస్తారో లేదో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కాగా పులుల సంఖ్య క్షీణించడం పట్ల అసలు గణాంకాల లెక్కింపు సరిగ్గా జరగలేదా..? లేకా పెద్దపులులు నిజంగానే మరణించాయా..? లేక ఆవలి తెలంగాణ పరిధిలోని అడవుల్లోకి వలస వెళ్లాయా..? అనే కోణాల్లో అటవీ శాఖ ఆలోచనలో పడినట్లు తెలిసింది.



కలవరపెడుతున్న ఘటనలు

ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో మూడేళ్ల వ్యవధిలో చోటుచేసుకున్న పెద్దపులుల మరణాలు అటవీశాఖను ఉలికిపాటుకు గురిచేస్తోంది. ఈ వివరాలను పరిశీలిస్తే..

- 2022 మే 11వ తేదీన ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్, పెద్దఅనంతాపురం సెక్షన్, పీఏపురం నార్త్‌బీట్ లోతువాగు సమీపంలో ఓ పెద్దపులి (టీ-94) అనుమానాస్పదంగా మృతిచెందినట్లు సుమారు 20రోజుల తర్వాత అటవీ అధికారులు గుర్తించారు.. అయితే ఇది ఆవాస మార్పు కారణంగా మరో పులితో జరిగిన భీకర పోరులో సహజసిద్ధంగా మరణించినట్లు అప్పట్లో అటవీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్దపులి నమూనాలను ల్యాబ్‌కు పంపించిన వాస్తవానికి తెలియజేస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఆ వివరాలను వెల్లడించలేదు.
- 2022 ఆగస్టు 9న వెలుగోడు రేంజ్‌లోని నార్త్‌బీట్ పరిధిలో ఉన్న గుండ్లమల్లెలమ్మ బేస్‌క్యాంపు సమీపంలో వెలుగోడు జలాశయం బ్యాక్‌వాటర్ ప్రదేశంలోని బుడగలవాగులో ఓ పెద్దపులి (టీ-48) కళేబరాన్ని అటవీ అధికారులు గుర్తించారు. అయితే ఆ పులికి మెడ చుట్టూ క్లచ్‌వైర్ ఉచ్చు ఉండటంతో తీవ్ర గాయమై రక్తస్రావం, చీము పట్టి మృతిచెందింది.
- 2023 మార్చి 6వ తేదీన నల్లమల అడవి నుంచి నాలుగు ఆడ పులికూనలు దారితప్పి కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం ఊళ్లోకి చేరాయి. గ్రామస్థులు ఆ పులికూనలను గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు తల్లిపులి (టీ-108) ఆచూకీ కోసం అటవీ అధికారులు నాలుగు రోజుల పాటు అనేక విధాలుగా అన్వేషించి నప్పటికీ ఆచూకీ లభించలేదు. చివరకు మార్చి 10వ తేదీన ఆ పులికూలను తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు తరలించారు. ఈ ఘటన అప్పట్లోనే దేశంలోనే సంచలనం రేకెత్తించింది. అప్పట్లో తల్లి పులి క్షేమంగానే ఉందని అటవీ అధికారులు చెప్పే ప్రయత్నాలు చేసినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు.
- ఆత్మకూరు రేంజ్, ముసలిమడుగు సెక్షన్, గుమ్మడాపురం బీట్ పరిధిలో గల దేవరసెల వద్ద 2023 ఏప్రిల్ 30న ఓ పెద్దపులి కళేబరాన్ని గుర్తించారు. అయితే మృతికి గల కారణాలపై అటవీ అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. పెద్దపులి శరీర అవయవాలను సేకరించి సీసీఎంబీ హైదరాబాద్‌కు పంపించారే తప్ప రిపోర్టు వివరాలను వెల్లడించలేదు.
- ఆత్మకూరు రేంజ్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్ సందుబాటు రస్తాలో ఓ పెద్దపులి బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు నడుముకు చిక్కుకుని తీవ్రంగా గాయపడిన విషయాన్ని 2024 ఫిబ్రవరి 25వ తేదీన అటవీ అధికారులు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. ఆతర్వాత మార్చి 5వ తేదీన రెస్క్యూ ఆపరేషన్ ద్వారా పులిని బంధించి బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రంలో వారం రోజుల పాటు సపర్యలు చేసి తిరిగి అడవిలో వదిలేశారు. కొన్నిరోజులకు ఆ పులి కూడా మరణించింది.
- ఈక్రమంలోనే 2025 మే 20వ తేదీన బైర్లూటి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఓ పెద్దపులి ఉచ్చు నుంచి తప్పించుకుని గాయపడినట్లు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. దీంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొని ఎట్టకేలకు జూన్ 5వ తేదీన పెద్దపులిని బంధించి వైద్యపరీక్షలు నిర్వహించారు. గాయం పెద్దది కావడంతో తిరుపతి జూపార్క్‌కు తరలించి అక్కడే సపర్యలు చేస్తున్నారు.



2022 మే 11వ తేదీన పీఏపురం నార్త్‌బీట్ లోతువాగు సమీపంలో లభ్యమైన పెద్దపులి కళేబరం

పీఎం మోదీని కలిసిన ఎంపీ శబరి

నంద్యాల రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివచరణ్ సోమవారం డిల్లీలోని పార్లమెంట్ భవనంలోని పీఎం ఛాంబర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ నంద్యాల పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించి అభివృద్ధికి తోడ్పడాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. నంద్యాల పార్లమెంట్‌కు కేటాయించిన, కేటాయించాల్సిన ఎంపీ నిధులపై చర్చించినట్లు వివరించారు. మోదీకి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని బహూకరించారు.



మోదీకి ఆంజనేయస్వామి విగ్రహాన్ని అందిస్తున్న శబరి, శివచరణ్

పరిశ్రమలు స్థాపిస్తే చేయూతనిస్తాం

- జిల్లాలో మెరుగైన అవకాశాలు
- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు వస్తే చేయూతనిస్తామని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. నంద్యాల పీజీఆర్ఎస్ హాల్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ (ర్యాంప్) కార్యక్రమంపై కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్ జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాంప్ కార్యక్రమం ద్వారా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వివిధ మండలాల్లో క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 30న నంద్యాలలో, ఆగస్టు 6న డోన్‌లో, 12న నంద్యాల మండలంలో, 13న ఆళ్లగడ్డలో, 19న బనగానపల్లెలో, 20న నందికొట్కూరులో, 26న పాణ్యంలో, 28న బేతంచర్లలో, సెప్టెంబర్ 3న డోన్‌లో, 9న ఆళ్లగడ్డలో, 10న ఆత్మకూరులో, 16న నంద్యాలలో, 17న కొలిమిగుండ్లలో, 18న బనగానపల్లెలో, 24న బేతంచర్లలో, 25న పాణ్యం మండలాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమాలకు ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇంజ నీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు, హార్టి కల్చర్ సిబ్బందిని పాల్గొనే చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయ ని అన్నారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో విజిలెన్స్ కమిషనర్



శ్రీశైలం చేరుకున్న విజిలెన్స్ కమిషనర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జున స్వామిని సోమవారం విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్రపునేఠ దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న విజిలెన్స్ కమిషనర్‌కు ఆలయ ఈవో శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. విజిలెన్స్ కమిషనర్ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ అధికారులు, వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఫిర్యాదుల్లో కొన్ని

- తన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలుకు చెందిన వీరస్వామి రూ.8లక్షలు, 5 తులాల బంగారం తీసుకుని మోసం చేశాడని రాధాకృష్ణ వీధికి చెందిన వి.నాగరాజు ఫిర్యాదు చేశారు.
- కర్నూలుకు చెందిన హెప్సిబా సునీలా కరుణాసాగర్, ఎలిజెబెత్ ఫాస్టర్లుగా పని చేస్తూ మార్కెట్ మాస్టర్ అనే యాప్ పేరు చెప్పి చాలా మందిని మోసం చేసినట్లు బాధితులు వాపోయారు. అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని గ్రూపులు చేసి ప్రతి ఆదివారం జూమ్ మీటింగ్ తీసుకుంటూ 578మంది నుంచి రూ.4కోట్ల వరకు మోసం చేసి తీసుకున్నారు. డబ్బులివ్వకుండా మార్కెట్ మాస్టర్ యాప్ బ్లాక్ అయింది. మోసం పోయామని భావించిన కర్నూలు చెందిన కళ్యాణి, గౌతమి, రాజేశ్వరి, పద్మ, పద్మావతి, నాగరాజు, విజయభాస్కర్, తాయన్నతో పాటు పలువురు బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- తన పొలానికి రస్తా ఇవ్వకుండా రైతు గొల్ల నాగప్ప అడ్డుపడుతున్నాడని, తనకు న్యాయం చేయాలని కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన జి.రాముడు ఫిర్యాదు చేశారు.
- వెల్దుర్తికి చెందిన ప్రశాంత్‌బాబు ఢిల్లీలో అనురాగ్ అనే వ్యక్తితో తనకు పరిచయం ఉందని, రైల్వే డిపార్ట్‌మెంట్‌లో జాబ్ ఇప్పిస్తామని రూ.12.50లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు శ్రీనగర్ కాలనీకి చెందిన రవిబాబు ఫిర్యాదు చేశారు.
- పంచలింగాల దగ్గర ఉన్న తన వ్యవసాయ భూమిలో ఉన్న 10 టేకు చెట్లను విద్యుత్ శాఖ అధికారులు అనుమతులు లేకుండా తొలగించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలం పంచలింగాల గ్రామానికి చెందిన మాధవరాజు ఫిర్యాదు చేశారు.
- ఐటీ కన్సల్టెన్సీ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన షణ్ముక్ సుదర్శన్ అనే వ్యక్తి రూ.4లక్షలు తీసుకుని మోసం చేశాడని జోహరాపురం గ్రామానికి చెందిన గుణశేఖర్ ఫిర్యాదు చేశారు.



ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



హాజరైన మార్గదర్శకులు

పీ-4తో పేదరిక నిర్మూలన

- 22 వేల కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శకులు
- కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానం అమలు చేస్తోందని, అందులో భాగస్వాములు కావాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో పీ-4 విధానం అమలుపై విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులతో భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అవసరంలో ఉన్న వారికి సాయం చేయడం పుణ్యకార్యమని, ఈ అవకాశం పీ4 విధానం ద్వారా లభిస్తోందన్నారు. మనం చేసే చిన్న సాయం అవసరంలో ఉన్న కుటుంబానికి ఎంతో ఆసరా ఇస్తుందని, సమాజంలో సాయం చేయగలిగిన సామర్థ్యం ఉన్నవారు మానవతా కోణంలో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. పీ-4 కార్యక్రమాన్ని మార్చి 30వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభించడం జరిగిందని, ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రంలో 15 లక్షల మంది బంగారు కుటుంబాల దత్తతను లక్ష్యంగా నిర్ణయించారనీ తెలిపారు. జిల్లాలో సర్వే చేసి 64వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. పీ-4 పాలసీకి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో 9440758201, 9441174933, 8125367303 నెంబర్లను సంప్రదించాలని అన్నారు. అదేవిధంగా ఎంపీడీవోలను సంప్రదించవచ్చని పీ-4 మార్గదర్శిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే Https://zeropovertyp4.ap.gov.in/ వెబ్‌సైట్ పోర్టల్‌ను ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సీ.వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

ఉల్లి నాటుకు రైతు పాట్లు



స్ప్రింకర్స్‌తో ఉల్లికి నీటితడులు అందిస్తున్న దృశ్యం

కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన ఓ రైతు ఉల్లినాటును బతికించుకునేందుకు చేసిన ప్రయత్నం ఇది. సరైన వాన లేక అరపదునులోనే ఈ గ్రామ రైతులు ఉల్లి నాటుకు దిగారు. ఉల్లినారు చేతికందడంతో వర్షం రాక పోతుందా అనే మొండి ధైర్యంతో ముందడుగు వేశారు. పదిరోజుల క్రితం అడపాదడపా కురిసిన చిన్నపాటి జల్లులకు ఇక్కడి నల్లరేగడి పొలాల్లో జోరుగా ఉల్లినాట్లు వేస్తున్నారు. అయితే నాటు వేసిన అనంతరం వర్షం జాడ లేదు. వారం రోజులకు పైగా వర్షం కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప వాన పడడం లేదు. దీంతో వెంకటగిరికి చెందిన బీవై గిడ్డయ్య అనే రైతు బాడుగకు స్ప్రింక్లర్లను తెచ్చి ఎకరన్నర పొలానికి తడి అందించాడు. సుమారు 40 పైపులను ఏర్పాటు చేసి నీటిని తరలించాడు. పొలంలో పైపులను మార్చడానికి ముగ్గురు కూలీలను ఉంచాడు. ఉల్లినాటును బతికించుకోవడానికి తప్పనిపరిస్థితి అని ఆ రైతు పేర్కొన్నాడు.

– కోడుమూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఉరుకుంద క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ఎల్లెల్సీలో స్నానాలు చేస్తున్న భక్తులు

కౌతాళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం ఉరుకుంద క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి అలంకరణ చేశారు. భక్తులు ఎల్లెల్సీ కాలువలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో విజయరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

మంత్రాలయంలో ఉధృతంగా తుంగభద్ర ప్రవాహం

- గంగమ్మ గుడిని తాకిన వరద
- తీర ప్రాంతాల్లో అధికారుల హెచ్చరిక



మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

మంత్రాలయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది మంత్రాలయంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. హొస్పేట్‌లోని టీబీ డ్యాం నుంచి 27 గేట్లను ఎత్తి 1,19,553 క్యూసెక్కుల నీటిని దిగువనున్న తుంగభద్ర నదికి విడుదల చేశారు. దీంతో ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద సోమవారం సాయంత్రం 310.84 మీటర్ల నీటి మట్టంతో 92,250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో నది ఒడ్డున ఉన్న గంగమ్మ గుడిని వరద చుట్టుముట్టింది. దీంతో తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ శివాంజల్, రెవెన్యూ అధికారులు జయరామిరెడ్డి, జనార్ధన్ రావు, భీమయ్యలు నది తీరాన్ని పరిశీలించారు. తీర ప్రాంత ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శ్రీమఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్,ఏఈ బద్రినాథ్ భక్తులకు ఇబ్బందులకు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నది ఒడ్డున ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, శ్రీమఠం సెక్యూరిటీ, గజ ఈతగాళ్లతో పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

టీజీవీ కళాక్షేత్రానికి నాలుగు జాతీయ బహుమతులు

తిరుపతి అభినయ ఆర్ట్స్ పోటీల్లో రాణించిన కళాకారులు



జ్ఞాపిక, నగదు పురస్కారం స్వీకరిస్తున్న నాటక దర్శకుడు కళారత్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కేంద్రంలోని అభినయ ఆర్ట్స్ సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు సత్తా చాటారు. ఈనెల 20 నుంచి 27 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి నాటక పోటీల్లో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' పద్య నాటకానికి నాలుగు జాతీయ బహుమతులు లభించాయి. ఈ నాటకానికి ఉత్తమ జ్యూరీ అవార్డుతోపాటు ఉత్తమ కథానాయకిగా సురభి ప్రభావతి, ఉత్తమ హాస్య నటి హసీనా, ఉత్తమ ఆహార్యం(మేకప్) సి.శ్రీనివాసులుకు బహుమతులు లభించినట్లు నాటక దర్శకుడు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య తెలిపారు. జాతీయ బహుమతులు సాధించిన కళాకారులను టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, కార్యవర్గ సభ్యులతోపాటూ ఇతర కళాకారులు అభినందించారు.

నిర్మాణదారులకు భారీ ఊరట..!

(5వ పేజీ తరువాయి)

నిబంధనలు ఇవీ..

- ఎస్ఆర్ఎస్ స్కీంలో భాగంగా 2025 జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్)కు అవకాశం ఉంటుంది.
- ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ కోసం 90 రోజులు గడువు ఉంటుంది.
- ప్రతి ప్లాట్‌కు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకుని ఉండాలి.
- ప్లాట్ విక్రయం తేదీ 30-06-2025లోపు అయి ఉండాలి.
- ప్లాట్ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ చార్జీలు ఉంటాయి.
- 10 శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే 14 శాతం అదనపు చార్జీలు విధిస్తారు.
- పాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు కూడా అవకాశం ఉంటుంది.
- ఇందుకు సంబంధించిన పోర్టల్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి రానుంది.
- ఈ స్కీమ్ అమలు ద్వారా అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న నగర, పట్టణ, కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఆయా పథకాల ద్వారా వివిధ నిర్మాణాలు, లేఅవుట్‌లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రయోజనాలెన్నో..

- అనధికార లేఅవుట్‌లో ప్లాట్లను క్రమబద్ధీకరిస్తే మున్సిపాలిటీ నుంచి ముఖ్యమైన ఎల్పీ నంబర్ వస్తుంది.
- నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ప్లాన్ మంజూరు చేస్తారు. ప్లాన్ ఉంటే బ్యాంకులు రుణ సౌకర్యాన్ని కల్పిస్తాయి. ప్లాట్ యజమానులకు ఆర్థికంగా ఇబ్బందులు ఉండవు.
- రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు నిర్మాణాలు జోరందుకుంటాయి. కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పనులు దొరుకుతాయి.
- క్రయ, విక్రయాలు చేసుకునేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయి.
- భవన నిర్మాణాలకు సునాయసంగా అనుమతులు లభిస్తాయి.

చాలా కాలంగా ఎదురు చూస్తున్నాం



క్రమబద్ధీకరణకు అవకాశం లేకపోడంతో అక్రమ నిర్మాణాలపై బ్యాంకుల్లో రుణాలు లభించడం లేదు. కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ను అమలు చేస్తే చాలా మందికి ప్రయోజనం కలుగుతుంది. అపరాధ రుసుం మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయిస్తే అందరూ హర్షిస్తారు. - తాహెర్ బాషా, ఆదోని

మధ్య తరగతికి ప్రయోజనం కలుగుతుంది



బీపీఎస్‌తో పాటు ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వ ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఈ జీవోలతో మధ్య తరగతి వారికి భారీ ఉపశమనం లభిస్తుంది. అక్రమ కట్టడాలు తగ్గే అవకాశం కూడా ఉంటుంది. ప్రభుత్వానికి కూడా పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది. - బాలమద్దయ్య, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఆదోని

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార ఫిర్యాదులకు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. పట్టణం లోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు లొంగ కుండా న్యాయంగా బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఎక్కువగా కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం దందాలు, అన్నదమ్ముళ్ల ఆస్తి తగదాలు వచ్చాయని తెలిపారు.

జలాశయాలు కళకళ

- శ్రీశైలానికి పోటెత్తిన వరద
- సుంకేసులకు 1.10 లక్షల క్యూసెక్కుల ఫ్లో
- తుంగభద్ర డ్యాం నుంచి 1.19 లక్షల క్యూసెక్కులు విడుదల
- నదితీర గ్రామాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ



నిండు కుండలా సుంకేసుల జలాశయం

కర్నూలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రాయలసీమ జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. సీమ జీవనాడి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి డ్యాం వద్ద 2,10,920 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతుండగా, ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి 1,28,175 క్యూసెక్కులు, సుంకేసుల బ్యారేజీ (తుంగభద్ర నది) నుంచి 1,03,437 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గంట గంటకు వరద పెరుగుతుండడంతో పది క్రస్ట్ గేట్ల ద్వారా 1,35,325 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ద్వారా 65,904 క్యూసెక్కులు చొప్పున 2,01,229 క్యూసెక్కులు దిగువన నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సీమ కాలువలకు 31 వేలు, హంద్రీనీవా కాలువ ద్వారా 2,818 క్యూసెక్కులు, తెలంగాణ రాష్ట్రం మహాత్మగాంధీ లిఫ్ట్ ఎత్తిపోతల పథకం ద్వారా 1,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు లేకపోయినా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వరద పోటెత్తింది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ 885 అడుగుల, సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా 882.80 అడుగుల లెవల్‌లో 203.42 టీఎంసీలు నిల్వ చేసి వచ్చిన వరదను వచ్చినట్లుగా స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు వదిలేస్తున్నారు.

సుంకేసులకు వరద కళ

కర్నూలు నగరానికి 26 కి.మీల దూరంలో ఉన్న సుంకేసుల బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. గరిష్ఠ నీటి నిల్వ 1.20 టీఎంసీలే. ఎగువన నుంచి రాత్రి 8.30 గంటల సమయంలో 1.10 లక్షల క్యూసెక్కులు బ్యారేజీకి వచ్చి చేరుతోంది. 0.634 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసి డ్యాం భద్రతా దృష్ట్యా 20 గేట్లు ఎత్తి వచ్చిన వరద వచ్చినట్లుగా 1.10 లక్షల క్యూసెక్కులు దిగువ శ్రీశైలానికి వదిలేస్తున్నారు. ఎగువన తుంగభద్ర డ్యాంకు భారీగా వరద వచ్చి చేరుతుంది. 96,836 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, సామర్థ్యం 105.78 టీఎంసీలు కాగా, గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రత దృష్ట్యా 1,624.54 అడుగుల లెవల్‌లో 75.601 టీఎంసీలు నిల్వ చేశారు. 28 గేట్లు ఎత్తి 1,06,548 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ఎగువ నుంచి వరద పెరుగుతుండడంతో రాత్రి 8:30 గంటల సయమానికి 1,19,613 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. మంత్రాలయం వద్ద 1,18,140 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. అలాగే మేళిగనూరు వద్ద వేదవతి నది, వాగులు కలుస్తుండడంతో ఆర్డీఎస్ వద్ద వరద పోటెత్తింది. మంగళవారం ఉదయానికి సుంకేసులకు భారీగా వరద నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు. వరద ఉధృతి దృష్ట్యా జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి సుంకేసుల బ్యారేజీ గేట్లను పరిశీలించారు. అలాగే ఎగువన తుంగభద్ర డ్యాం నుంచి వరద పెరుగుతుండడంతో కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల్లోని నదీతీర గ్రామాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.



క్రస్ట్‌గేట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి



విడుదల అవుతున్న నీరు

పంటల బీమాతో భరోసా



- రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధం
- కౌలురైతులు కూడా అర్హులే
- ప్రీమియం చెల్లింపునకు వరికి వచ్చేనెల 15 వరకూ
- మిగిలిన పంటలకు ఈనెల 31వ తేదీ వరకు గడువు

డోన్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకంతో రైతన్నలకు భరోసా లభిస్తోంది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ఆఫ్ కంపెనీ ఇండియా లిమిటెడ్ ద్వారా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. వాతావరణంలో వచ్చే మార్పులతో పంట నష్టం కలిగితే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడానికి ఖరీఫ్ సాగులో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చాయి. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని జిల్లాలో అమలులోకి తీసుకురాగా అందులో నంద్యాల జిల్లా కూడా ఉంది. జిల్లాలో కొర్రలు, కందులు, సజ్జలు, మొక్కజొన్న, పత్తి, అరటి, వేరుశనగ, వరి పంటలు మాత్రమే ఈ పథకం ద్వారా బీమా సౌకర్యం కల్పించారు. వరికి రూ.800 ప్రీమియం చెల్లిస్తే రూ.40వేలు బీమా రైతులకు దక్కుతుంది. ఎకరా కొర్రలకు రూ.160లు ప్రీమియం చెల్లిస్తే రూ.16వేలు, కందులకు రూ.140 చెల్లిస్తే రూ.20వేలు, సజ్జలకు రూ.160లు చెల్లిస్తే రూ.16వేలు, మొక్కజొన్నకు రూ.660 చెల్లిస్తే బీమా రూ.35వేలు వర్తిస్తుంది. పత్తికి రూ.1600 చెల్లిస్తే రూ.40వేలు, అరటికి రూ.2,750లు చెల్లిస్తే రూ.55వేలు, వేరుశనగకు రూ.560 చెల్లిస్తే రూ.28వేలు బీమా ఉంటుంది. వీటన్నింటికీ ఈనెల 31లోపు ప్రీమి యం చెల్లింపు చేసినవారికే ఈ పథకాలు వర్తిస్తాయి. వరికి మాత్రం రూ.800 చెల్లించేందుకు వచ్చేనెల 15వరకు గడువు ఉంటుంది. తుపాన్, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో పంట నష్టపోయిన రైతులను ఆదరించడం ఈ పథకం ప్రధాన ముఖ్య ఉద్దేశ్యం. పంట నష్టం అంచనా వేసి బీమాను వర్తింపజేస్తారు. పంటలు సాగుచేసుకున్న రైతులు, కౌలురైతులు కూడా ఈ పథకంలో చేరడానికి అర్హులు అని ఏడీఏ సునీత సూచించారు.

సద్వినియోగం చేసుకోండి



పంటల బీమాను రైతులు సద్వినియోగం చుకోవాలి. బ్యాంకు నుంచి పంట రుణం పొందిన రైతులు వారు రుణం తీసుకునే సమయంలో బీమా ప్రీమియం మొత్తాన్ని రైతుల నుంచి తీసుకుని వారే బీమా కంపెనికి జమ చేస్తారు. బీమా పరిహారం వచ్చిన సమయంలో ఆ బీమా మొత్తాన్ని నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకోని, పంట రుణాలు తీసుకోని వారు సచివా లయాలు, మీసేవ, రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. **- సునీత, ఏడీఏ, డోన్**

వేధింపుల కేసు నమోదు

కొత్తపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళను వేధిస్తున్న మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. రోజూ ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడున్నట్లు ఆ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో బస్సులు నడిపేందుకు ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు-1డిపో మేనేజర్ సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు భారీ వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. భారీ వాహనాలు నడపడంలో కనీసం రెండు సంవత్సరాలు అనుభవం కలిగి ఉన్న డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99851 81304 నంబర్‌ను సంప్రదించాలని డిపో మేనేజర్ సూచించారు.

విశ్రాంత డీఎస్పీపై దాడి

- అప్పు చెల్లించాలని లీగల్ నోటీసు పంపడమే కారణం

ఆదోని, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్.కె.డి. కాలనీలో నివాసముంటున్న విశ్రాంత డీఎస్పీ రఘునాథచారిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన మేరకు.. సోమవారం ఉదయం వాకింగ్‌కి వెళ్లిన విశ్రాంత డీఎస్పీపై కొందరు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బెంగళూరుకు చెందిన రాఘవేంద్రరెడ్డికి విశ్రాంత డీఎస్పీ కొంత డబ్బు ఇచ్చారు. తిరిగి చెల్లించాలని కోరినా రాఘవేంద్రరెడ్డి నుంచి స్పందన లేదు. దీంతో న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు పంపడంతో ఆగ్రహించిన రాఘవేంద్ర రెడ్డి డీఎస్పీని దూషించి, దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నల్లమలలో వేటగాళ్లపై దాడి

- ఒకరి అరెస్టు, పరారీలో మరో ముగ్గురు
- నాటుతుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం



వేటగాడితో ఫారెస్టు అధికారులు

రుద్రవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవిలో రుద్రవరం ఫారెస్టు రేంజ్ అధికారులు వేటగాళ్లపై దాడులు నిర్వహించినట్లు ఇన్‌చార్జి రేంజర్ ముర్తుజావలి తెలిపారు. వివరాలు.. సోమవారం రేంజ్ పరిధిలోని అహోబిళం నార్త్‌బీట్‌లో నూతల బావి రస్తా సమీపంలో అహోబిళానికి చెందిన వేటగాళ్లు నాటుతుపాకీతో వెళ్తుండగా అటవీ శాఖ సిబ్బంది దాడి చేసింది. నాటుతుపాకీతో పాటు మందుగుండు సామగ్రి అహోబిళంకి చెందిన ప్రభాకర్ అనే వేటగాన్ని అరెస్టు చేశారు. మరో ముగ్గురు వేటగాళ్లు పరారయ్యారు. వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చినట్లు విచారణలో నిర్ధారణ అయ్యింది. ప్రభాకర్‌ను ఆళ్లగడ్డ కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 15రోజుల రిమాండ్‌కు ఆదేశించారు. పరారీలో ఉన్న ముగ్గురు వేటగాళ్లను త్వరలో పట్టుకుంటామని ఇన్‌చార్జి రేంజర్ తెలిపారు. సెక్షన్ ఆఫీసరు రామక్రిష్ణ, బీట్ ఆఫీసర్లు నాగహుసే నయ్య, సురేంద్రగౌడ్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

'సీమ'కు జీవనాడి హంద్రీనీవా



మల్యాల వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, గౌరు వెంకటరెడ్డి

- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య
- హంద్రీనీవా నీటి పరిశీలన
- ఏడు పంపుల ద్వారా 2,750 క్యూసెక్కుల నీటి విడుదల

నందికొట్కూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం జీవనాడి అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం మల్యాల వద్ద గల హంద్రీనీవా పథకాన్ని టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా పథకానికి రూ.690కోట్లతో యుద్ధ ప్రాతిపదికన విస్తరణ చేపట్టి పనులు పూర్తిచేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీటివిడుదల చేసి నదీజలాలకు హారతి ఇచ్చాక ఇంజనీర్లు క్రమ క్రమంగా నీటిని విడుదలను పెంచుతూ వచ్చారని వాటిని పరిశీలించామన్నారు. మండలంలోని మల్యాల వద్ద గల హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల నుంచి ఏడు పంపుల ద్వారా దాదాపుగా 2750 క్యూ సెక్కుల నీటిని వదిలారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూల్ జిల్లా, కడప, అనంతపురం, చిత్తూరు, జిల్లాలోని దా దాపుగా ఆరులక్షల ఎకరాలకు సాగునీరు, ఆయా గ్రామల, పట్టణాలకు తాగునీరు అందించే లక్ష్యంగా ఈ ఎత్తిపోతల నిర్మించారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు రాకతో ఈకల సాకార మైందన్నారు. కార్యక్రమంలో పగిడ్యాల మండల టీడీపీ కన్వీనర్ పలుచాని మహేశ్వరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి: కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా తీవ్ర నేరంగా పరిగణించి అరికట్టాలని కలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. పట్టణంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రపంచ అక్రమ రవాణా డేకు సంబంధించిన పోస్టరును అధికారులతో కలిసిఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు అక్రమ రవాణాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడైనా అలాంటి ఘటనలు జరిగితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు గానీ, 18001027222కు సమాచారం అందించాలని కోరారు. ప్రపంచ మానక అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి ఏడాది జులై 30వ తేదీన జరుపుకుంటున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన శిక్ష: డీఎం

నందికొట్కూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించినా, దాడి చేసినా.. యత్నించినా, విధులకు ఆటంకం కలిగించినా కఠిన శిక్ష తప్పదని నందికొట్కూరు డిపో మేనేజర్ నాగరాజు తెలిపారు. సోమవారం నందికొట్కూరు ఆర్టీసీ డిపోలో విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై దాడులకు పాల్పడితే చట్టప్రకారం ఎలాంటి చర్యలు ఉంటాయన్న పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నందికొట్కూరు డిపో సెక్రటరీ సురేష్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.జె.రాబర్ట్, ఎస్ఎంయూ డిపో సెక్రటరీ వెంకటరత్నం, సీనియర్ నాయకులు రామస్వామి, జనార్ధన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేయాలి

పాణ్యం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ వీబీ చిత్ర పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో లింగ భేదాలు, సమతుల్య భవిషత్తు నిర్మాణం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డాక్టర్ అశోక్ కుమార్, కోఆర్డినేటర్ హరిత, జేఎన్‌టీయూఏ వక్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాల సమస్యను పరిష్కరించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు వెంటనే పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు డీఈవో జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు రామచంద్రారెడ్డి, శివయ్య మాట్లాడుతూ పదో తరగతి స్పాట్ మూల్యాంకనానికి సంబంధించిన జాకీర్‌హుస్సేన్, దస్తగిరి బాషా, నౌమాన్‌బాషా, శ్రీనివాసులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవుడి మనుగడ

ఆత్మకూరురూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతోనే మానవుడి మనుగడ సాధ్యపడుతుందని సెట్కూరు సీఈవో డా.వేణు గోపాల్ పేర్కొన్నారు.సోమవారం మండలంలోని బైర్లూటి గిరిజన గూడెంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ ప్రకృతి దినోత్సవం సందర్భంగా పర్యావరణ సమతుల్యంపై విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినిలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి

నందికొట్కూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు సబ్ జైల్‌ను నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకోలేని ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఫిర్యాదులను ఆన్ లైన్ నెంబరు 15100 ద్వారా కూడా తెలియజేయవచ్చన్నారు. సూపరింటెండెంట్ రఘునాథరెడ్డిని జైలులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్యానెల్ లాయర్ వెంకటేశ్వర్లు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠ

ఆత్మకూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): సిద్దాపురం చెరువు కట్ట వద్ద సోమవారం పలు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గంగాదేవి, నాగదేవతా విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆయా విగ్రహాలకు పూజలు చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- నాగులకట్టల వద్ద ప్రత్యేక పూజలు
- నైవేద్యం సమర్పించి పుట్టలో పాలు పోసిన భక్తులు



బండిఆత్మకూరు: పెద్దదేవళాపురంలో నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



పగిడ్యాల: నెహ్రూనగర్‌లో..



జూపాడుబంగ్లాలో..



గడివేముల మండలంలో..

నాగుల చవితిని సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగలకట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించారు. పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయాలకు తరలివచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెటవర్క్



నందికొట్కూరు(రూరల్): నందికొట్కూరులో..



పాములపాడులో..



నంద్యాల(కల్చరల్): నంద్యాల పట్టణంలో..



మిడుతూరులో..

టీడీపీ వల్లే సీమ సస్యశ్యామలం

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఎర్రగుంట్లలో మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, పక్కన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

బండిఆత్మకూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో దివంగత నందమూరి తారకరామారావు, బుడ్డా వెంగళరెడ్డి, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి వల్లే సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించటంతో సీమ సస్యశ్యామలంగా ఉందని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో సోమవారం రాత్రి సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం అందిచిన పథకాలు, ఇవ్వాల్సిన పథకాలగురించి వివరించారు. అనంతరం జరిగిన సభలోవారు మాట్లాడుతూ నాడు తెలుగుగంగ, ఎస్సార్బీసీ , హంద్రీ-నీవా, గాలేరు నగరి, అలగనూరు రిజర్వాయర్, పోతిరెడ్డిపాడు, బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్లు నిర్మించటంతోనే సీమకు సాగు నీరు అంది సస్యశ్యామలంగా మారిందన్నారు. కెసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ రామలింగారెడ్డి, తెలుగుగంగ వైస్ చైర్మన్ మనోహర్ చౌదరి, రమణారెడ్డి, డి.సిద్ధయ్య, జగన్మోహన్‌రెడ్డి, రఘుస్వామిరెడ్డి, డాక్టర్ భరద్వాజశర్మ, నరసింహారెడ్డి, సురేష్‌రెడ్డి, మండల కన్వీనర కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి చిన్న లింగారెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు, సర్పంచ్‌లు రామచంద్రుడు, శ్వేతకుమారి, ప్రసాద్ పాల్గొన్నారు.



బీరవోలులో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పగిడ్యాల: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాల్లో సోమవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ దామోదార్‌రెడ్డి, టీడీపీ నాయకులు వాసురెడ్డి, విజయ్ కుమార్, లక్ష్మాపురం షమిన్, శ్రీనివాసులు, రామకృష్ణగౌడ్, హనుమన్న తదితరులు ఉన్నారు.

మిడుతూరు: సుంకేసుల గ్రామంలో సుపరిపాలనలో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, గ్రామ నాయకుడు భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు సర్వోత్తమ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సుబ్బారావు, వెంకటయ్య, పుల్లయ్య, షబ్బు బాషా, నరసింహగౌడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన ప్రభుత్వం'



నంద్యాలలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామలను ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని రోజాకుంట ఎన్టీఆర్ షాదీఖానాలో 30,40,41,42వ వార్డు ప్రజలతో సోమవారం 'బాబు షూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, వైస్‌చైర్మెన్ గంగిశెట్టి శ్రీధర్, వైసీపీ జనరల్ సెక్రెటరీ శశికళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సూపర్ సిక్స్ హామీల అమల్లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని శ్రీశైలం నియోజకవర్గం వైసీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్‌లో బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో లేనిపోని హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు నేడు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సయ్యద్‌మీర్, అంజాద్‌అలి, విజయ్‌చౌదరి, మారుబత్తుల విజయకుమార్, జయకృష్ణ, బాలస్వామియాదవ్, మోమిన్ ముస్తఫా, మునీర్‌బాషా తదితరులు ఉన్నారు.



ఆత్మకూరులో మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

మల్లన్నను దర్శించుకున్న శ్రీశైల జగద్గురు పీఠాధిపతి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జున స్వామి వారిని శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామిజీ ఆలయానికి చేరుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం ఆలయానికి చేరుకున్న జగద్గురు పీఠాధిపతికి ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా నగర సంకీర్తన



మహానందిలో నగర సంకీర్తన చేస్తున్న భక్త బృందం

మహానంది, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం ఉదయం సమరతసేవా భక్త బృందం నగర సంకీర్తన కార్యక్రమంను నిర్వహించారు. ప్రధాన ఆలయం ముందు భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. అనంతరం ఆలయ మాడవీధుల గుండా భజనలు చేస్తూ నగర సంకీర్తనను చేశారు. ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మండలంలోని సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

- మహానంది క్షేత్రం లో సోమవారం రాత్రి పల్లకీ సేవను ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.
- మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి అలంకార వస్తువులను దాతలు ఆలయ ఏఈవో మధుకు అందజేశారు. సోమవారం నంద్యాలకు చెందిన వెంకటసుబ్బమ్మ, శ్రీలక్ష్మి, సూర్యకళ, రాజ్యలక్ష్మి మిత్ర బృందం అమ్మవారికి రెండవ శ్రావణ శుక్రవారం రోజున అలంకరణ చేయడానికి రూ.10 వేల విలువ గల గాజులను ఏఈవోకు అందజేశారు. అర్చకులు రాజమాణిక్యశర్మ, పూర్ణానందశర్మ, కొమ్మెద్ది సుబ్బయ్యశర్మ పాల్గొన్నారు.

సిబ్బందికి సన్మానం

మహానంది, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహానంది గ్రామ సచివాలయం నుంచి బదిలీపై వెళ్తున్న పలువురు సిబ్బందిని సోమవారం ఘనంగా సిబ్బంది ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభను నిర్వహించారు. ఇందులో సచివాలయం వ్యవసాయాధికారి వసుంధర, మహిళ పోలీస్ కృష్ణ, ఉద్యానవన శాఖాధికారిణి శారదమ్మ, విలేజ్ ఆరోగ్యశాఖాధికారి హేమలతను సన్మానించారు. వైసీపీ నాయకుడు సాంబిరెడ్డి, టీడీపీ నాయకులు గంగిశెట్టి మల్లికార్జునరావు, పాశంరాజు, లక్ష్మీనారాయణ యాదవ్, సుదర్శనం రెడ్డి, కైలాస్, పటాల శ్రీను, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

నంద్యాల రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ రామకృష్ణ డిగ్రీ కళాశాల వద్దనున్న వివేకానంద ఆడిటోరియంలో మంగళవారం జరిగే సదస్సును జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయిబాబానగర్‌లోని గ్రంథాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటప్రకారం స్మార్ట్‌మీటర్లను పెంచిన విద్యుత్ చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ నరసింహులు, ప్రజా సంఘాల నాయకులు క్రిస్టియన్ జేఏసీ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ మన్యం జానయ్య, జమాతే ఇస్లామిక్ హింద్ కన్వీనర్ సమ్మద్, ముస్లిం జేఏసీ నాయకుడు ఆబులైజ్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, అన్సర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నందికొట్కూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): నేడు నందికొట్కూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బేబి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు హాజరు కావాని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.

1న దేవదాయశాఖ ఉప కమిషనర్ రాక

బండిఆత్మకూరు జూలై28(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కృష్ణనంది క్షేత్రానికి దేవదాయశాఖ ఉప కమిషనర్ గురుప్రసాద్ వచ్చేనెల 1న విచ్చేస్తున్నట్లు ఆలయ ఈవో వేణునాథరెడ్డి సోమవారం తెలిపారు. ఆలయ వంశ పారంపర్య వ్యవస్థాపక ధర్మకర్త చిట్టిబొట్ల భరద్వాజశర్మ నియామక విషయమై విచారణ నిమిత్తం వస్తున్నారని చెప్పారు. నంద్యాల, మహానంది, బండిఆత్మకూరు మండలాల ప్రజలు ఎవరైనా విచారణ నిమిత్తపు రికార్డులు, లిఖిత పూర్వకంగా అందజేయవచ్చని చెప్పారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామంలో టీడీపీ కార్యకర్త మలిగేల ఏసేపు (54) మృతి చెందడంతో రూ. 5వేల ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ వారి కుమారుడు టీడీపీ నాయకులు సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు టేకూరి నాగేశ్వరరావు ఇచ్చిన డబ్బులను అందించారు. టీడీపీ నాయకులు సత్యరాజ్, ఆల్ఫ్రెడ్, రాజేష్, వినయ్, బాస్కర్, రమేశ్‌రెడ్డి, సుందర్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



కొత్తపల్లిలోని నాగంపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

కొత్తపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని నాగంపల్లి సహకార సొసైటీకి యూరియా లారీ వస్తుందని రైతులు సోమవారం యూరియా కోసం పడిగాపులు కాశారు. ఎట్టకేలకు యూరియా లారీ రావడంతో అన్నం, నీళ్లు మానేసి యూరియా కోసం ఎగబడ్డారు. మండలంలోని గువ్వలకుంట్ల, వీరాపురం, లింగాపురం కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తే కేవలం ఒకే లారీ రావడం, అందులో 450 బస్తాలు మాత్రమే వచ్చాయి. కనీసం ఒక బస్తా యూరియా అయినా రాకపోతుందా? అని ఆశగా ఎదురు చూశారు. అయితే కొందరికి మాత్రమే యూరియా అందడంతో రాని రైతులు ఉసూరుమంటూ వెళ్లారు. ఏదీఏమైనా 20 రోజులుగా కొత్తపల్లి మండల రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిరైతుకు యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బహిరంగ వేలం

నంద్యాల కల్చరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని పలు దేవస్థానాలకు చెందిన ఖాళీ స్థలాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. మల్లికార్జున దేవస్థానం ఆవరణలో జిల్లా దేవదాయశాఖ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించినట్లు తెలిపారు. కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానానికి చెందిన స్థలానికి ఏడాది రూ.16 వేలు, బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిని స్థలానికి ఏడాదికి రూ.31 వేలు, లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన స్థలానికి రూ.15,500 వచ్చినట్లు తెలిపారు. మూడు సంవత్సరాలు కౌలుకు ఇచ్చేందుకు ఈ వేలం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల సిబ్బంది, ధర్మకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

'అభ్యంతరాలను తెలపాలి'

కొత్తపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రైతుల భూముల రీసర్వేపై అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం మండలంలోని బట్వారుపల్లె గ్రామంలో తహసీల్దార్ ఉమారాణి డీఎల్ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)పై గ్రామ సభ నిర్వహించారు. ఆమె బట్వారుపల్లె గ్రామానికి చెందిన భూ రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. వాటిపై ఏమైనా అభ్యంతరాలుంటే అర్జీల రూపంలో తెలియజేయాలని సూచించారు. రీసర్వేలో కొందరు రైతులభూములు తక్కువ, ఎక్కువ వస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయనీ, అలాంటి రైతులు అర్జీలు ఇస్తే వాటిపై రికార్డుల ఆధారంగా సర్వే చేసి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు, గ్రామ సేవకులు పాల్గొన్నారు.

బోరుమంటున్న మెకానిక్‌లు

- సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు
- మూడు దశాబ్దాలుగా థర్డ్‌పార్టీ ద్వారా వేతనాల చెల్లింపు
- కాంట్రాక్టర్ దయతోనే జీవనం
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని వేడుకోలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

మంచి నీటి పథకం బోరు మెకానిక్‌ల జీవనం దుర్భరంగా ఉంది. కనీసం వీరిని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా కూడా గుర్తించడం లేదు. థర్డ్ పార్టీ ఏజెన్సీ పేరిట అది కూడా కాంట్రాక్టర్ ద్వారా ఏళ్లుగా జీతాలు చెల్లిస్తున్నారు. దీంతో నెలల తరబడి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చాగలమర్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో అధికారికంగా 13,056 బోర్లు ఉన్నాయి. బోర్ల మరమ్మతుల పనులను మెకానిక్‌లు చేయాల్సి ఉంది. మండలానికి ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మండలపరిషత్‌లకు విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధుల నుంచి ఏటా తాగునీటి వనరుల నిర్వహణ కోసం గ్రాంట్ విడుదల అవుతుంది. ఈనిధుల్లోనే బోర్ల పరికరాల కొనుగోలుతో పాటు మెకానిక్‌లకు ఇచ్చే వేతనాలు కూడా ఉంటాయి. ఎన్నో సంవత్సరాల నుంచి పని చేస్తున్నా వీరి వేతనం రూ.15 వేలకు మించి లేదు. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా బోర్లతో పాటు రక్షిత మంచి నీటి పథకాల బాగోగులు చూసే మెకానిక్‌లకు సక్రమంగా జీతాలు అందడం లేదు. మండల పరిషత్ నుంచి ఇచ్చే వేతనాలు కాంట్రాక్టర్ ఖాతాలోకి జమ చేస్తారు. ఆ కాంట్రాక్టర్ ఖాతా నుంచి వీరికి జీతాలు చెల్లిస్తుంటారు. కొందరు కాంట్రాక్టర్లు తమ ఖాతాలో పడ్డ డబ్బులు వెంటనే ఇచ్చేస్తే మరి కొందరు వారి అవసరాలకు ఖర్చు పెట్టుకొని తమకు నచ్చినప్పుడు లేదా తన వద్ద డబ్బులు ఉన్నప్పుడు వీరికి వేతనాలు చెల్లిస్తున్నారు. కొందరికి నెలల తరబడి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది.


పెద్దబోధనంలో బోరుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తే..

ఏళ్ల సీనియార్టీ ఉన్న ఉద్యోగులు మరేదైనా శాఖలో ఉంటే ఈ పాటికి తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలనో లేదా తమ వేతనాలు పెంచాలనో ఆందోళన చేసేవారు. అయితే వీరు తమను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానైనా గుర్తించి ప్రతి నెల వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇలా ప్రభుత్వ శాఖల్లో ఎదుగుబొదుగులేని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను గుర్తించి వారికి న్యాయం చేసేందుకు మంత్రి నారాలోకేష్ సారథ్యంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ అయిన తమకు న్యాయం చేయాలని బోరుమెకానిక్‌లు వేడుకుంటున్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి



ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతనం కూడా ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి. తక్కువ వేతనమైన ప్రతి నెల ఇస్తే ఎంతో కొంత ఆసరాగా ఉంటుంది. మంత్రి నారా లోకేశ్ తమకు న్యాయం చేస్తారన్న ఆశతో ఉన్నాం.

● బాబురావు, బోరుమెకానిక్, చాగలమర్రి

108 సేవలను సద్వినియోగం చేసుకోండి

● జిల్లా మేనేజర్ సంజీవరెడ్డి

బనగానపల్లె/కొలిమిగుండ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా మేనేజరు సంజీవరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలో ఉన్న 108 వాహనాన్ని, సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్‌ను కలుసుకున్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు 108 కు ఫోన్ చేయకుండా అత్యవసరమైతే ఫోన్ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 108 సిబ్బంది టెక్నీషియన్ వెంకటేశ్వర రావు, బాలకృష్ణ, డ్రైవర్లు ప్రభా కర్, ఓబులేసు తదిరతులు పాల్గొన్నారు. అలాగే కొలిమిగుండ్ల 108 సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నీషియన్ చంద్రనాయక్, పైలెట్లు చన్నియ్య, పవన్‌గోపాల్ పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న మేజనేర్ సంజీవరెడ్డి

బస్సులు ఏర్పాటు చేయాలి

- ప్రియా సిమెంట్ పరిశ్రమ ఎదుట రాచెర్ల గ్రామస్థుల ఆందోళన


ఆందోళనకారులు, పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరామిరెడ్డి

ప్యాపిలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రియా సిమెంట్స్‌లోని పాఠశాల నుంచి గ్రామానికి బస్సులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ప్రియా సిమెంట్ పరిశ్రమ ఎదుట రాచెర్ల గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పాఠశాల నుంచి గ్రామానికి దాదాపు 3కి.మీ. దూరం ఉందని, రోజూ పిల్లలు కాలినడకన పాఠశాలకు వెళ్లిరావాలంటే ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పరిశ్రమ పీఆర్‌వో కోటేశ్వరరావు మాత్రం బస్సుకి సంబంధించిన డిమాండ్‌ను అర్జీ రూపంలో ఇస్తే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వగా, తక్షణమే బస్సు ఏర్పాటు చేస్తామని చెప్పితేనే ఆందోళన విరమిస్తామని భీష్మించారు. సమాచారం తెలుసుకున్న సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులు, పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు జరిపిన ఫలించలేదు. తమ డిమాండ్‌ను నెరవేర్చేవరకు ఆందోళనను కొనసాగిస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

బేతంచెర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 42 ప్రభుత్వ చౌక దుకాణాల్లో తూకాల్లో డీలర్లు మోసాలకు, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని కోఆపరేటివ్ సొసైటీ ప్రభుత్వ చౌక దుకాణాల్లోని ఎలక్ట్రికల్ కాటాలకు సీల్ వేశారు. వ్యాపార దుకాణాల్లో బ్రాండ్‌నేమ్‌తో పాటు ఆల్ ఇంక్లూడింగ్ టాక్సెస్ ఉన్న వాటినే దుకాణదారులు విక్రయించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు, జరిమానాలు విధిస్తామన్నారు. మోసాలకు పాల్పడుతున్నవారిపై 9885217776నంబరుకు ప్రజలు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.


కాటాలకు సీలు వేస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది

కుక్కల బెడదను నియంత్రించాలి

బేతంచెర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కల బెడదను నియంత్రించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నాయకులు, కుక్కకాటుకు గురైన బాలుడు కిరణ్ కుటుంబ సభ్యులు కమిషనర్ హరిప్రసాద్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు తిరుమలేష్, దస్తగిరి ఉద య్, ప్రదీప్, మధు, ఖాదర్ ఉన్నారు.

బీసీ ఇందిరమ్మ పరామర్శ

బనగాన పల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుపేట టీడీపీ కార్యకర్త జక్కు నాగార్జున తల్లి జక్కుశేషమ్మ మృతి చెందారు. సోమవారం ఆమె మృతదేహానికి టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆండాల్ తిరునక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు విశేష పుజలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి, గోదాదేవి అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కొనసాగుతున్న పూజలు


పూజల్లో పాల్గొన్న పండితులు

కొలిమిగుండ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారు జీర్ణోద్ధరణ చేపట్టిన ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలతిరుపతి దేవస్థానం ఆగమపండితులు పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, ద్వారతోరణ ధ్వజ కుంభారాధనం, అగ్ని ప్రతిష్ఠ, శ్రీ విష్ణు సహస్ర పారాయణం, జలాధివాసం తదితర పూజలు నిర్వహించారు. రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ మీనాక్షిసుందరం, ప్రెసిడెంట్ రామరాజు పూజల్లో పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో అక్రమాలు: ఎన్‌ఎస్‌యూఐ

డోన్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఎన్ఎస్ యూఐ జిల్లా నాయకులు తెలుగు విజయకుమార్ ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. రెగ్యులర్ వార్డెన్లు లేని హాస్టళ్లలో పర్యవేక్షణ కొరవడిందన్నారు.

నంద్యాలకు వెళ్లిన బీజేపీ శ్రేణులు

బేతంచెర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నంద్యాల జిల్లాకు వచ్చిన సందర్భంగా మండలం నుంచి నాగ మోహన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు గుండా అశ్వర్థ నారాయణ, కార్యకర్తలు ఉన్నారు.

వడ్డెర కులస్థులు అన్ని రంగాల్లో ఎదగాలి

కొలిమిగుండ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్డెరులు అన్ని రంగాల్లో ఎదగాలని ఆ సంఘం నాయకుడు శిల్పి సుబ్బరాయుడు కోరారు. సోమవారం అంకిరెడ్డిపల్లె గ్రామంలో మండల అధ్యక్షుడు బండ సుధాకర్ ఆధ్వర్యంలో వడ్డెరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ వడ్డెర సొసైటీలకు మైనింగ్ భూములు ఇవ్వాలని, రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెంకటకృష్ణ, నాగేశ్వర, బండ నాగాంజనేయులు, జగన్, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యాగంటిలో వైద్య శిబిరం

బనగానపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో సోమవారం వైద్య శిబిరం శాంతిరాం వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులను వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పలువురిని ఆస్పత్రికి రెఫర్ చేశారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి

బనగానపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): యాదవులు ఐక్యంగా ఉండాలని అఖిలభారత యాదవ మహాసభ కన్వీనర్ మద్దయ్య, మండల అధ్యక్షుడు చల్లామద్దిలేటి, రిటైర్డు ఉపాధ్యాయుడు చల్లా బాలస్వామి యాదవ్ కోరారు. సోమవారం పలుకూరులో యాదవ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామస్థాయి నుంచి యాదవ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు యాదవులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ తల్లిదండ్రులదే

రుద్రవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పిల్లల సంరక్షణ తల్లిదండ్రులదేనని సీఐ దస్తగిరిబాబు అన్నారు. సోమవారం రుద్రవరం పోలీసుస్టేషన్ పరిధిలోని అప్పనపల్లె గ్రామంలో పిల్లల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కరపత్రాలు పంపిణీ


కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాక రాజువేముల గ్రామంలో వైసీపీ నాయకులు భూమా చెంచిరెడ్డి, మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, భూమా కిషోర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ భూమా వీరభద్రారెడ్డి, బత్తుల నాగేశ్వర యాదవ్, భూమా చెంచిరెడ్డి, మనోహర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, నర్సిరెడ్డి, క్రిష్టిపాడు సర్పంచ్ శివరామిరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

'ప్రజలను పట్టించుకోని ప్రభుత్వాలు'

డోన్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు ఆరోపించారు. సోమవారం బి.రామదుర్గంలో సీపీఐ గ్రామ మహాసభ నిర్వహించారు. గ్రామంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు.

క్షయరహిత సమాజమే లక్ష్యం

చాగలమర్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత సమాజాన్ని రూపొందించడమే లక్ష్యమని హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రి బీసీ సంక్షేమ హాస్టల్‌లో టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేంద్రబాబు, ఏఎన్ఎం గ్రాల్లెట్, పుష్పలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, పీఆర్ఏఈ కొండారెడ్డి, సూపర్‌వైజర్ సుశీల, ఏపీఎం నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా


ఎంఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వీర రాఘవయ్య

రుద్రవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ఎంఈవో వీరరాఘవయ్య అన్నారు. సోమవారం రెగ్యులర్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఏళ్ల తరబడి ఎంఈవో పోస్టు ఇన్‌చార్జితోనే నెట్టుకొచ్చారు. రెగ్యులర్ ఎంఈవో బాధ్యతలు స్వీకరించడంతో పాఠశాలల్లో విద్యాభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ నాయకులు భార్గవ రామయ్య, నరసింహ, చంద్రశేఖర్, పలువురు ఎంఈవోను సన్మానించారు.

మహన్యాస రుద్రాభిషేకం

చాగలమర్రి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయం, కోదండ రామాలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో మహన్యాస రుద్రాభిషేకం, జలాభిషేకం పూజలు చేశారు. సీతారాములకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పాత శివాలయంలో శ్రావణమాసం సందర్భంగా శివపార్వతులను అలంకరించి సుదర్శన హోమం చేశారు. దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఖాసిం స్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో సోమవారం ఖాసిం స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. భక్తులు పతెహాలు చేశారు. భక్తులు తరలివచ్చి గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వరస్వామి పల్లకీసేవ

బనగానపల్లె, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామ హేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉమా మహేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగించారు. భక్తులు పూజలు చేశారు. ఈవో పాండురంగారెడ్డి, పూజారులు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి

బనగానపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలని తహసీల్దారు నారాయణరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికలో పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలను అర్జీ రూపంలో తహసీల్దారుకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండల స్థాయి అధికారు లు, వీఆర్‌వోలు, సెక్రటరీలు తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధిక, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, ఈవోఆర్‌డి బాలాంజనేయులు, విద్యుత్ ఏఈ గర్జప్ప, అధికారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

అవుకు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబగిరి స్వామి పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి సోమవారం తెలిపారు. వీరి నుంచి రూ. 4100 నగదు, ఆరుసెల్‌ఫోన్లు, సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. మరి కొంత మంది పారిపోయినట్లు తెలిపారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగమ్మ.. చల్లగా చూడమ్మా

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


డోన్: నెహ్రూనగర్‌లోని నాగుల పుట్టకు పాలు పోసి పూజలు చేస్తున్న భక్తులు

డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజక వర్గాల్లోని గ్రామాల్లో సోమవారం మహిళలు నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగదేవత పుట్టవద్ద నూతన దంపతులు, మహిళలు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలుపోసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నాగమ్మ చల్లగా చూడాలని వేడుకున్నారు.

● ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


ప్యాపిలిలో..


బనగానపల్లెలో..


చాగలమర్రిలో ..


ఉయ్యాలవాడలో..


ఆళ్లగడ్డలో..


దొర్నిపాడులో..


బేతంచెర్లలో..


కొలిమిగుండ్లలో..